www.nagaranijam.com
PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక
NNTV TELANGANA నగర నిజం

సంపుటి : 14 | సంచిక :81 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 13 శనివారం, జూన్ 2026 | పేజీలు : 4+ | ₹ 3
Volume : 14 | Issue : 81 | Rangareddy | Editor : Yela.Purushotham | 13 Saturday , JUNE 2026 | Pages : 4 + | Price : 3/-
Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం - అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత..



● మంత్రి పొంగులేటి

**ఖమ్మం: (నగర నిజాం బ్యూరో) జూన్ 12:** నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామ అభివృద్ధికి రెండున్నరేళ్లలో రూ.19.25 కోట్ల వ్యయంభైరవునిపల్లిలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం, బుద్ధారంలో రూ.2 కోట్ల వ్యయం తో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటిప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం – అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.శుక్రవారం నేలకొండపల్లి మండలంలో పర్యటించి ముందుగా భైరవునిపల్లి గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని పనిచేస్తోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వానికి పేదలకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన లేకపోయిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. రెండవ విడతలో నియోజక వర్గానికి 2 వేల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇల్లు అనేది పేదలకు ఆత్మ గౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, ప్రతి సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పారదర్శకంగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం రైతులకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ అందిస్తున్నామని చెప్పారు. 25 లక్షల మంది రైతులకు రెండు లక్షల వరకు 21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేశామని, రైతు భరోసా మొత్తాన్ని ఎకరాకు 12 వేలకు పెంచామని తెలిపారు. నిరుద్యోగ యువత కు 72 వేల ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొన్నారు.భైరవునిపల్లి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. నందిగామ బ్రాంచ్ కెనాల్ నుంచి అజయ్ తండా వరకు భైరవునిపల్లి క్రాస్ రోడ్డు మీదుగా రూ.4.50 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టామని చెప్పారు. భైరవునిపల్లి బోదులబండ మీదుగా కొనాయి గూడెం వరకు రూ.7.90 కోట్లతో మరో రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు.భైరవునిపల్లి నుంచి నాచేపల్లి వరకు రూ.4.72 కోట్లతో బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.అలాగే భైరవునిపల్లి నుంచి చెరువుమాదారం వరకు రూ.1.22 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టామని, రూ.60 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించామని పేర్కొన్నారు. మంచినీటి సరఫరా, సైడ్ డ్రైన్లు, విద్యుత్ తీగల సమస్యల పరిష్కారానికి మొత్తంగా భైరవునిపల్లి గ్రామ అభివృద్ధి కోసం గత రెండున్నరేళ్లలో రూ.19.25 కోట్ల పనులు చేపట్టినట్లు స్పష్టం చేశారు.రాష్ట్రంలో రైతులు పండించిన రికార్డు స్థాయి



ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిందని మంత్రి తెలిపారు. కొంత ఆలస్యం జరిగినప్పటికీ మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు తడిసిన ధాన్యాన్ని కూడా స్వీకరించామని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు చివరి గింజ వరకు కొనుగోలు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు.ధాన్యం కొనుగోలుతో పాటు రైతుల ఖాతాల్లో వెంటనే చెల్లింపులు జమ చేసినట్లు తెలిపారు. రైతులు ఏ పంట పండించినా మద్దతు ధరతో కొనుగోలు చేసిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమేనని పేర్కొన్నారు. పేదల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం నేలకొండపల్లి మండలం బుద్ధారం గ్రామంలో 2 కోట్ల వ్యయంతో బుద్ధారం తండా – రాజారాంపేట్ రోడ్డు నుండి లకారం ఏటి వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. గత రెండున్నర సంవత్సరాలలో గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.12.39 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ వి సీతారాములు, డిపిఓ రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ పిల్లి, రాంప్రసాద్, ఎంపీడీఓ ఎర్రయ్య, ఏఓ రాధ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 100 సీసీటీవీల జల్లెడ.. చైన్ స్నాచర్ల అరెస్ట్






● మహిళ మెడలోని మంగళసూత్రం లాక్కెళ్లిన

**నిందితుల పట్టివేత.. ఒకరు పరారీలో**

**మేడ్చల్, జూన్ 12 (నగర నిజం):** అత్వెల్లి కోర్టు సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద కల్వర్టు సమీపంలో మహిళ మెడలోని బంగారు మంగళసూత్రాన్ని లాక్కెళ్లిన చైన్ స్నాచర్ల ముఠాను మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు 100కు పైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించిన పోలీసులు కేసును ఛేదించారు.పోలీసుల వివరాల ప్రకారం, మే 29న రత్నదీప్ కంపెనీలో కార్మికురాలిగా పనిచేస్తున్న పటూరి శుభనారాణి విధులు ముగించుకుని కంపెనీ బస్సు నుంచి దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెను అడ్డగించారు. అనంతరం ఆమె మెడలో ఉన్న అర తులం బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పరారయ్యారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మేడ్చల్ పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలం నుంచి నిందితులు ప్రయాణించిన మార్గాల్లోని సుమారు 100కు పైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి వారి కదలికలను గుర్తించారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుల జాడను కనుగొన్నారు.దర్యాప్తులో భాగంగా కర్ణాటకలోని బీదర్ జిల్లా, మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు చివరకు జవహర్‌నగర్ ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టు చేసిన నిందితుల్లో రూప్‌సింగ్ చతుర్‌సింగ్ తక్ ఉండగా, మరో నిందితుడు శంషర్ సింగ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక ఇమిటేషన్ చైన్, నేరానికి ఉపయోగించిన స్ప్లెండర్ మోటార్ సైకిల్, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసు ఛేదనలో మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, మేడ్చల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అద్దాని సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కీలక పాత్ర పోషించారు. వారి పర్యవేక్షణలో మేడ్చల్ క్రైమ్ టీమ్, సీసీఎస్ అధికారులు సమన్వయంతో పనిచేసి నిందితులను అరెస్ట్ చేశారు.మేడ్చల్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, సీసీఎస్ డీసీపీ శ్రీ శంకర్ రెడ్డి మార్గదర్శకత్వంలో కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. నిందితుల అరెస్టులో విశేష కృషి చేసిన పోలీసు సిబ్బందికి తగిన ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా నేర కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. అలాగే దుకాణాలు, వ్యాపార సంస్థలు, నివాస సముదాయాల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు.

## చెరువుమాదారం చెరువులో చేపల రేటు దగ్గర రెండు వర్గాల ఘర్షణ

● 30 రూపాయలా? 70 రూపాయలా?.. రెండు వర్గాలుగా చీలిన సొసైటీ సభ్యులు



**ఖమ్మం :(నగర నిజం బ్యూరో) జూన్ 12,**నేలకొండపల్లి మండలం చెరువు మాదారం గ్రామంలోని మత్స్య సహకార సంఘం సమావేశం తీవ్ర వాగ్వాదంతో రసాభాసగా మారింది. చెరువులో చేపలు పట్టేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశం చేపల కిలో ధర విషయంలో సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోవడం తో అర్ధాంతరంగా ముగిసింది. గ్రామంలో ఈ వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.చెరువుమాదారం గ్రామ చెరువును స్థానిక మత్స్య సహకార సంఘం లీజుకు తీసుకొని ప్రతి ఏటా చేప పిల్లలు వదులుతుంది. ఈ ఏడాది చేపలు పట్టే సమయం రావడంతో పాలకవర్గం గురువారం హుటాహుటిన సమావేశం ఏర్పాటు చేసింది. అయితే కిలో చేపల ధర నిర్ణయించే విషయంలోనే అసలు వివాదం మొదలైంది.పాలకవర్గం కిలో చేపను ?30కి సభ్యులకు ఇవ్వాలని తీర్మానించింది. దీన్ని మరో వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. గత ఏడాది అగ్రిమెంట్ ప్రకారం సభ్యులకు కిలో ?30 చెల్లించాలని, ఆ ధరకు ఇస్తేనే చేపలు పట్టేందుకు అనుమతిస్తామని వారు డిమాండ్ చేశారు. మరో వర్గం ఒక్కసారిగా 30 తగ్గించడం అన్యాయమని, ఫీడ్ ఖర్చులు, కష్టం దృష్ట్యా 70 కంటే తగ్గేది లేదని తేల్చి చెప్పారు. సమావేశానికి ముందస్తు సమాచారం, నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా మీటింగ్ ఏర్పాటు చేయడంపై సభ్యులు మండిపడ్డారు. “మాకు తెలియకుండా సమావేశం ఎలా పెడతారు? సొసైటీ నిబంధనల ప్రకారం అందరికీ సమాచారం ఇవ్వాలి కదా?” అని అధ్యక్షుడిని నిలదీశారు. దీనికి అధ్యక్షుడు స్పందిస్తూ “మాకు అన్ని పర్మిషన్లు ఉన్నాయి. మత్స్య శాఖ అధికారుల అనుమతితోనే చేపలు పడుతున్నాం. మేము నిర్ణయించిన ధరకే ఇస్తాం” అని తెగేసి చెప్పినట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు.

**చేపల వేట అడ్డుకుంటాం: సభ్యుల హెచ్చరిక**

పాలకవర్గం రేటు గత 30 రుపాయలు తీరుకు నిరసనగా కొంతమంది సభ్యులు ఆందోళనకు దిగారు కిలోకు ?70 చెల్లించే వరకు చెరువులో చేపలు పట్టనివ్వమని, అవసరమైతే చెరువు వద్దే బైఠాయిస్తామని హెచ్చరించారు. దీంతో సమావేశంలో తీవ్ర గందరగోళం నేలకొంది. ఎలాంటి తీర్మానం లేకుండానే సమావేశం అర్ధాంతరంగా ముగిసింది.

## గ్రేడ్-2 ఈవోలకు గ్రేడ్-1గా పదోన్నతులు

● ఉత్తర్వులు అందించిన మంత్రి సురేఖ



**హైదరాబాద్,నగర నిజం :** దేవాదాయ శాఖలో గ్రేడ్–2 కార్యనిర్వహణ అధికారులు(ఈవో)గా పనిచేస్తున్న 26 మందికి గ్రేడ్–1 ఈవోలుగా పదోన్నతి కల్పించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పదోన్నతుల ఉత్తర్వుల్ని ఈవోల కు అందించారు. దేవాదాయశాఖ కమిషనర్ వి.హన్మంతరావు, రాష్ట్ర అర్చక ఉద్యోగ ఐకాస కన్వీనర్ డీవీఆర్ శర్మ, అర్చక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు హాజరయ్యారు.

## ఎవరితోనూ పొత్తులుండవ్.. పోటీ భాజపాతోనే

● కేటీఆర్



**అమరావతి, నగర నిజం :** సీఎం రేవంత్‌రెడ్డితో తనకు వ్యక్తిగత పంచాయితీ లేదని.. ప్రభుత్వాన్ని నడుపుతున్న విధానం తనతో సహా చాలా మందికి నచ్చడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలో ఉందని.. హైదరాబాద్‌లో వర్షం పడి ప్రజలకు ఇబ్బంది ఎదురైతే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.


# బీజేపీ గలీజ్ రాజకీయాలు చేస్తోంది

● జగ్గా రెడ్డి

**హైదరాబాద్, జూన్ 12 :** ప్రధానమంత్రి 12 ఏండ్లుగా ప్రభుత్వం లో ఉంటూ గలీజ్ రాజకీయాలు చేస్తోంది. మీనాక్షి నటరాజన్ ను ఉద్దేశపూర్వకంగా బీజేపీ అట్టుకుందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి విమర్శించారు.గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ మధ్యప్రదేశ్ లో మూడో రాజ్యసభ సీట్ కోసం దిగజారుడు రాజకీయాలు చేసింది. సదా సీదా మహిళ నేత మీనాక్షి నటరాజన్. మీనాక్షి లాంటి హిళలను బిజెపి అడ్డుకోవడం దౌర్భాగ్యం. ఎన్నికల కమిషన్ను వాడుకొని కాంగ్రెస్ రాజ్యసభ ను అడ్డుకుంది. ప్రధాని మోదికి నటరాజన్ ను అడ్డుకోవడంతో ఏం అవసారం. ప్రైవేట్ ఫిర్యాదు లో ఎం ఉందొ లేదో తెలీదు. చిన్న కేస్ సాకుతో రిజక్టు చేస్తారా.. కామ ఫుల్ స్టాప్ లు కూడా చూసి ఎలెక్షన్ కమిషన్ చూసి ఆపేస్తుందా. గాంధీ ఐడియాలజీ లో పని చేసే వ్యక్తి మీనాక్షి నటరాజన్, రాహుల్ గాంధీ చెప్తూనే ఉన్నారు ఓటు చోరీ చేసే గెలుస్తున్నారు. వెస్ట్ బెంగాల్లో అన్ని స్థానాల గెలుపు మీతో సాధ్యమా! అధికారం తో ఎన్నికల కమిషన్ అడ్డుపెట్టుకొని రాష్ట్రాలను కబ్జా చేస్తోంది. ఎన్నికల కమీషన్ సిస్టం ను బీజేపీకి బ్రేక్ చేస్తోంది. గలీజ్ రాజకీయాలు కాంగ్రెస్ కి ఎం అవసరం. 12 ఏండ్లు ప్రధాని గా మోడీ అధికారంలో ఉన్నారు. కుట్రలు.. కుతంత్రాల పాలనే. పరిపాలన లో నీతి లేదు. పనికి మాలిన ఇష్యును అడ్డం పెట్టుకుని మీనాక్షి నామినేషన్ తిరస్కరణ చేశారు.మోడీ కార్యాలయం ఇంత దుర్మార్గంగా వ్యవహరించింది. ఒక్క సీటు కోసం ఇంత దిగజారుడు అవసరమా..? సిగ్గు పడాలా..? సిగ్గుపడ్వాల్సిన అంశమా అనేది బీజేపీ నేతలు ఆలోచించుకోండి. అధికారం ఇచ్చింది పరిపాలన చేయండి అని మిమ్మల్ని నమ్మి మూడో సారి అధికారం ఇచ్చారు. మూడు కోట్ల ఉద్యోగం అన్నారు... నల్లదనం తెచ్చి అకౌంట్ లో వేస్తా అన్నారు అదీ లేదు. 12 ఏండ్లల్లో 24 కోట్ల ఉద్యోగాలు ఇస్తా అన్నారు ఏమైంది .. జవాబు ఉందా..?బీజేపీ నాయకుల మగతనం... ఇచ్చిన మాట నిలబెట్టుకుని నిరూపించుకోండి. అంతే కానీ... షార్ట్ కట్ లో రాజ్య సభ సభ్యత్వం లాక్కోవడం లో లేదు మీ మగతనం. దొంగతనం చేసింది బీజేపీ వాళ్ళు.. బురద జల్లేది BRS. నటరాజన్ ఎంపీ కాకుండా నీతి మాలిన దొంగ వ్యవస్థ బీజేపీ. ఆ బురద తెలంగాణ కాంగ్రెస్ నేతల మీద బురద జల్లుతుంది. మీరు చేసిన పని కూడా మీరు చెప్పుకోలేని పరిస్థితి. హరీష్ రావు.. ప్రతిపక్ష నాయకుడు కాబట్టి ఏదో ఒకటి మాట్లాడుతున్నాడు. హరీష్ మా మీద బురద జల్లడం కాదు.. నీతిమాలిన చర్య చేసిన బీజేపీ నీ ఎందుకు ప్రశ్నించడం లేదు. మా దగ్గర నాయకులు బయటకు మాట్లాడతారు. బీజేపీ లో మాట్లాడమని చెప్పండి. ప్రాంతీయ పార్టీల్లో ఒక్కడే హీరో. బీజేపీ లో ఎవరు మాట్లాడినా అప్పుడే ఖతం అవుతారు. స్వేచ్ఛ ఎక్కువ కాంగ్రెస్ లో.. అందుకే కాంగ్రెస్ అంటారు. ఊహాగానాలకు సమాధానాలు ఉండవు. అనుమానాల మీద రాజకీయం నడవదు. బీజేపీ తాను చేసిన దొంగతనం పై చర్చ లేకుండా మా పై బురద జల్లాడు. బాధితుల మైన మేము సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. హరీష్ మాటలకు తాడు బొంగరం లేదు. ప్రభుత్వం ఉన్నప్పుడు మామ సంకలో ఉన్నాడు. ఇప్పుడు రోడ్ల మీద పడ్డాడు. కాంగ్రెస్ లో కోవర్ట్ లున్నారనే ఆరోపణలపై జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు. కోవర్టులు ఉన్నారని బీజేపీ బురద జల్లి.... తాను చేసిన దొంగతనం పై పై చర్చ జరగకుండా చూస్తుంది. ఇక్కడ ఎవరైనా కోవర్టులు ఉంటే తొడ్కలు తీస్తాం. నమోదు కానీ కేసును... ఆధారంగా తీసుకుని నామినేషన్ తిరస్కరించారు.




## తూప్రాన్ ఆర్డీవో బావయ్యకు కాంగ్రెస్ నాయకుల జింక మల్లేశం మర్యాదపూర్వక సన్మానం




**మెదక్ బ్యూరో నగర నిజం :తూప్రాన్, జూన్ 11:**తూప్రాన్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన బావయ్యను తూప్రాన్ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జింక మల్లేశం, వెంకటాయపల్లి మాజీ సర్పంచ్ లంబ రమేష్, బన్సీ నాయక్, కుమ్మరి బాలకృష్ణ, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు ఆర్డీవోతో మండలంలోని ప్రజా సమస్యలు, రైతుల ఇబ్బందులు, రెవెన్యూ సంబంధిత అంశాలపై చర్చించారు. అనంతరం ఆర్డీవో బావయ్య మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రైతులు, సామాన్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు.

# టీజీపీఎస్సీ వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచాలి

● నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి టిజిపిఎస్సి చైర్మన్ బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, వివేకానంద గౌడ్



**ఎల్బీనగర్, జూన్ 12 (నగర నిజం):** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్సి) ద్వారా విడుదలవుతున్న నియామక నోటిఫికేషన్లలో గరిష్ట వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 44 సంవత్సరాల నుంచి 46 సంవత్సరాలకు పెంచాలని తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశంకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో అమలులో ఉన్న జి.ఓ. ఎంఎస్ నెం.42 ప్రకారం గరిష్ట వయోపరిమితి 46 సంవత్సరాలుగా ఉండేదని, అనంతరం జారీ చేసిన జి.ఓ. ఎంఎస్ నెం.86 ద్వారా దానిని 44 సంవత్సరాలకు పరిమితం చేయడం వల్ల అనేక మంది అర్హులైన అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు శాఖల్లో చాలా సంవత్సరాల తర్వాత నియామక నోటిఫికేషన్లు వెలువడుతున్నాయని, ముఖ్యంగా డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డి ఈ ఓ), డిగ్రీ కళాశాల లెక్చరర్ వంటి కీలక పోస్టులకు సుదీర్ఘ విరామం అనంతరం నియామక ప్రక్రియ ప్రారంభమవుతోందని తెలిపారు. క్రమబద్ధమైన వార్షిక నియామక క్యాలెండర్ లేకపోవడం వల్ల పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యార్హతలు కలిగిన అనేక మంది అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యుత్తమ విద్యార్హతలు, విషయ పరిజ్ఞానం, అనుభవం ఉన్నప్పటికీ ప్రస్తుతం అనేక మంది అభ్యర్థులు తక్కువ వేతనాలతో ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నారని, వారికి కూడా ప్రభుత్వ సేవలో చేరే అవకాశం కల్పించేందుకు గరిష్ట వయోపరిమితిని 46 సంవత్సరాలకు పెంచడం అవసరమని కోరారు. అదేవిధంగా టీజీపీఎస్సీ దరఖాస్తు రుసుమును ప్రస్తుతం ఉన్న రూ.1000 నుంచి రూ.100కు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ యువతపై భారం తగ్గించి, ఎక్కువ మంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ప్రభుత్వం, టీజీపీఎస్సీ అధికారులు ఈ అంశాలను సానుకూలంగా పరిశీలించి నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయడంతో పాటు వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, ఇంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు ఘన సత్కారం



**మొయినాబాద్, జూన్ 12 (నగర నిజం):**శుక్రవారం తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుకులతో అశ్విని భాయ్ ఆధ్వర్యంలో "క్లూ టుడే న్యూస్ ఛానల్ ఎడిటర్ ఠాకూర్ సూరజ్ సింగ్,చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు కోమిడి వెంకటరెడ్డి, -సి.ఎన్ రెడ్డి,- ఎస్.ఆర్.ఇ. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్. కె.ఎం.. మోహన్ రావు,-సన్ మార్ట్ ఫర్నిచర్ యాజమని భవాని విక్రమ్ సింగ్ ఠాకూర్ లు మర్యాద పురువకంగా గవర్నర్ ని శాలువాతో రాజ్ భవన్ లో సన్మానం చేయడం జరిగింది.

## జయశంకర్ బడిబాట



**రాయికల్ జూన్ 12 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచే లక్ష్యంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అల్లిపూర్ ఉపాధ్యాయులు జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత, అందుతున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా 10 మంది విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ప్రతి విద్యార్థిని పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, రాజన్న, మహేష్, బాలమురళి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

● ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

● తెలంగాణ వ్యకాసం జిల్లా అధ్యక్షులు పి.అంజయ్య

● మాల్, కిషన్పల్లి గ్రామాల్లో సంఘం సభ్యత్వం నమోదు



**ఇబ్రహీంపట్నం, జూన్ 12 ( నగరనిజం ) :** ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం యాచారం మండలం మాల్, కిషన్ పల్లి గ్రామాల్లో సంఘం యొక్క సభ్యత్వాన్ని నమోదు చేసి, ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి.అంజయ్య మాట్లాడుతూ... 2 సార్లు ఫోటో దింపే విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీకి కేంద్రం కుట్ర చేస్తోందని అన్నారు. పెండింగులో ఉన్న ఉపాధి హామీ కూలీల డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి వారం క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించాలన్నారు. జీరాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు రోజువారీ వేతనం రూ.800 ఇవ్వాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 14న షాద్ నగర్ లో జరగనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు ఇందిరమ్మ, కూలీలు, సీనియర్ మేట్లు సాయులు, పర్వతాలు, వెంకటయ్య, రాజు, రాములు, వెంకటేష్, లత, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

● కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సిందే..

● ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గ్యార పాండు

● డీఆర్ఓ అనంత రెడ్డికి వినతి పత్రం అందజేత



ఇబ్రహీంపట్నం, జూన్ 12 ( నగరనిజం ) : గ్రామ పంచాయతీ వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం యూనియన్ జిల్లా కార్యదర్శి గ్యార పాండు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహా ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి అనంతరెడ్డికి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ రాజు, గ్యార పాండు మాట్లాడుతూ... గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రతినెల 1వ తేదీనే వేతనాలు అందేలా 50 కోట్ల బడ్జెట్ ను కేటాయిస్తామని చెప్పిన నేటికీ వేతనాలు చెల్లించలేదన్నారు. ఈ వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. జీవో నెంబర్ 51 ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కరోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. పెండింగ్లో ఉన్న నాలుగు నెలల వేతనాన్ని తక్షణమే ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ. 26,000 వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రమాదం జరిగి మరణించిన సిబ్బందికి రూ. 20 లక్షల నష్టపరిహారం కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కార్మికులందరికీ రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు కనీసం రూ. 30 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జగన్, పోచమోని కృష్ణ, యూనియన్ కోశాధికారి దేవదాస్, యూనియన్ నాయకులు శేఖర్, మాధవి, యాదయ్య, జగన్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీల వద్దకు 'బడిబాట'..

● పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయుల పిలుపు




**రాయికల్ జూన్ 12 (నగర నిజం)** ప్రభుత్వ బడిబాట కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. అడవి ప్రాంతంలో ఉపాధిహామీ పనుల్లో నిమగ్నమైన తల్లిదండ్రుల వద్దకు నేరుగా వెళ్లి బడిబాట ప్రచారం నిర్వహించా రు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కూలీల తో మాట్లాడుతూ.. పాఠశాల వయస్సు ఉన్న ప్రతి బిడ్డను బడికి పంపాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్, ఉపాధి హామీ సూపర్వైజర్ సాగర్,ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేందర్, వసంతరావు, రవికుమార్, రతిలాల్, రాజశేఖర్, మహేష్, రాజన్న, జీవన్ రెడ్డి, బాలమురళి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం

- **చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్.**



**హైద్రాబాద్ జూన్ 12:** అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హై స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న అంశం డిప్యూటీ డీఈఓ నిర్వహించిన పరిశీలనలో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అదేవిధంగా అ యొక్క పుస్తకాలను డిప్యూటీవో సీజ్ చేయడం జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం పుస్తకాల విక్రయం చేపట్టడం పట్ల అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బషీర్బాగ్ నగర శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడేలా ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని ఏబీవీపీ నాయకులు అన్నారు. ప్రభుత్వ విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాల యాజమాన్యంపై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఏ విద్యాసంస్థ కూడా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం చేపట్టకుండా విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ విక్రమాదిత్య, నగర కార్యదర్శి సురేందర్, విభాగ్ ఖాఖీ కన్వీనర్ సుప్రజ్, నగర ఖాఖీ కన్వీనర్ రాహుల్ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

- **కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, జూన్ 12 ( నగరనిజం ) :** అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇల్లు రెండో విడత అతి త్వరలో రానున్నాయని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ... ప్రతి పేదవాడికి పక్క ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు చెందాలని అన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గంలో ఎంతోమంది నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్లు లబ్ధి పొందారని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నిరంతరం ప్రక్రియ అని అన్నారు. మొదటి విడతలో ఇందిరమ్మ లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లు కేవలం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో రావడం మాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హాయంలో పేదవారికి ఎటువంటి లబ్ధి చేకూరలేదని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## ఎస్‌బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, చిల్‌కూర్ లో ఉచిత శిక్షణ

**మొయినాబాద్, జూన్ 12 (నగర నిజం):** ఎస్‌బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, చిల్‌కూర్ లో ఉచిత శిక్షణ ఇవ్వబడును మగ్గం పని నేర్పించుటలో ఉచిత శిక్షణ ఇవ్వబడును. భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చిల్కూర్ నందు నుండి 17.06.2026 గ్రామీణ ప్రాంత మహిళా అభ్యర్థులు శిక్షణ ఇవ్వబడును ఆసక్తి గలవారు నుండి 12.06.2026 సంస్థ కార్యాలయంలో లేదా క్రింద ఇవ్వబడిన ఫోన్ నెంబర్ల ద్వారా మీ పేరు నమోదు చేసుకోగలరు అభ్యర్థులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కు చెందిన వారై ఉండాలి.వయోపరమితి: 18 సంవత్సరాల నుండి 50సంవత్సరాల లోపు ఉండాలి, శిక్షణా కాలా పరిమితి: 30 రోజులు, అభ్యర్థులు సమర్పించవలసిన ధృవ పత్రములు ఎస్.ఎస్.సి మెమో, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, బ్యాంక్ పాస్ బుక్ అన్ని జిరాక్స్ కాపిలు సమర్పించవలేను ఉచిత శిక్షణతో పాటు శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి ,ఉచిత భోజన సౌకర్యం మరియు ఉచితముగా యూనిఫాం, టూల్ కిట్స్ ఇవ్వడం జరగుతుంది అని సంస్థ సంచాలకులు మహమ్మద్ అలీ ఖాన్ తెలియజేశారు.వివరములకు: 8500165190, 9550606019 పై ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.సంస్థ చిరునామా: ఎస్.బి.ఐ.ఆర్.ఎస్.ఇ.టి.ఐ , చిల్కుర్ మొయినాబాద్, రంగారెడ్డి జిల్లా

## సీపీఎం యువజన సమ్మేళనం విజయవంతం చేయాలి

- **సీపీఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్**



**మొయినాబాద్, జూన్ 12 (నగర నిజం):** శుక్రవారం సిపిఎం పార్టీ మొయినాబాద్ మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ యువజన సమ్మేళనంకు సంబంధించిన పోస్టర్స్ విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ ఈనెల 16,17 తేదీలలో రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ లో యువజన సమ్మేళనం రెండు రోజులపాటు జరుగుతాయని రాష్ట్రవ్యాప్తంగా యువజనులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపై సమ్మేళనంలో చర్చించి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారని అన్నారు యువజన సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సిపిఎం యువజన సంఘం డివైఎఫ్ఐ ఆల్ ఇండియా అధ్యక్షులు రాజ్యసభ ఎంపీ ఏ ఏ రహీం తదితరులు పాల్గొంటారని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మొయినాబాద్ మండల నాయకులు ముంజ గళ్ళ ప్రభుదాస్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ నాయకులు వినోద్ నాయుడు సిపిఎం నాయకులు చిన్న, కాజా మియా, శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి కూలీలకు కూలీ రేటు రూ.800 పెంచాలి





- **ఉపాధి పనిలో రెండుసార్లు ఫోటో తీసే విధానం రద్దు చేయాలి**
- **వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సిహెచ్.జంగయ్య**
- **ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా**

**ఇబ్రహీంపట్నం, జూన్ 12 ( నగరనిజం ) :** ఉపాధి హామీ పనిలో రెండుసార్లు ఫోటో తీసే విధానం రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కాకి రమేష్, చాతాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సూపర్ డెంట్ జంగయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కాకి రమేష్, చాతాళ్ల జంగయ్య మాట్లాడుతూ... ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు ప్రతిరోజు రెండుసార్లు ఫోటో తీయడం ద్వారా సిగ్నల్ రాకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పనిచేసిన కూలీలకు వారం వారం డబ్బులు చెల్లించాలన్నారు. జి.రామ్.జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మ గాంధీ పేరుతో ఉన్న ఉపాధి చట్టాన్ని కొనసాగించాలన్నారు. పని ప్రదేశంలో నీళ్లు, నీడ కల్పించాలన్నారు. పెండింగులో ఉన్న మూడు వారాల డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం పూట మాత్రమే పనులు చేయించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాల్లో సీనియర్ మేట్లను ఎఫ్.ఏ లుగా నియమించాలన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు కూలీ రేటు రూ. 800 పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉపాధి హామీ కూలీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు సామెల్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు మేడిబాయ్ ఆనంద్, మండల సహాయ కార్యదర్శి దయ్యాల గణేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుగ్గరాములు, సీఐటీయూ జిల్లా నాయకులు తులసిగారి నర్సింహ, నాయకులు బండి సత్తన్న, యాదగిరి, చెరుకూరి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదవండి..లక్ష్యాన్ని సాధించండి..





- **నాణ్యమైన విద్యకు చిరునామా ప్రభుత్వ విద్యాసంస్థలు:పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**
- **పటాన్చెరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ**

**నగర నిజం జూన్ 12** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇష్టపడి చదివి.. లక్ష్యాన్ని సాధించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులకు నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ డిజిటల్ ప్యానెల్స్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్య వ్యవస్థ బలోపేతానికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వంగరి అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ పరిశోధనలో విశిష్ట ప్రతిభ చాటిన డాక్టర్ మేరుగు రవి కుమార్

- **పీహెచ్‌డీ పట్టా సాధించిన రవి కుమార్‌కు డీజీపీ వి.వి. శ్రీనివాస్ అభినందనలు**



**ఎల్బీనగర్, జూన్ 12 (నగర నిజం):** సైబర్ సెక్యూరిటీ రంగంలో విశిష్ట పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా సాధించిన డాక్టర్ మేరుగు రవి కుమార్‌ను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (టెక్నికల్ సర్వీసెస్) వి.వి. శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతిక రంగంలో దేశానికి ఉపయోగపడే అంశంపై పరిశోధన చేపట్టి ఉన్నత విద్యను పూర్తి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. డాక్టర్ మేరుగు రవి కుమార్ “భారతదేశంలో సైబర్ సెక్యూరిటీ పరిశోధన ఫలితాలపై విశ్లేషణ: రెండు దశాబ్దాల అధ్యయనం (2005–2024)” అనే అంశంపై డా. ఉలగనాథన్ మార్గదర్శకత్వంలో విస్తృత పరిశోధన నిర్వహించి, భారతీయార్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. భారతదేశంలో గత రెండు దశాబ్దాలుగా జరిగిన సైబర్ సెక్యూరిటీ పరిశోధనల ధోరణులు, ఫలితాలు, సవాళ్లు, భవిష్యత్ అవకాశాలపై ఆయన చేసిన అధ్యయనం అకడమిక్ వర్గాల ప్రశంసలు అందుకుంటోంది. ఈ పరిశోధనలో దేశవ్యాప్తంగా సైబర్ భద్రత రంగంలో జరిగిన పరిశోధనలను సమగ్రంగా విశ్లేషించడంతో పాటు, సైబర్ నేరాల నియంత్రణ, డిజిటల్ భద్రత బలోపేతం, భవిష్యత్ పరిశోధనలకు మార్గదర్శకంగా నిలిచే పలు సూచనలను ప్రతిపాదించారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ సెక్యూరిటీ ప్రాధాన్యత మరింత పెరుగుతోందని, ఈ నేపథ్యంలో డాక్టర్ రవి కుమార్ చేసిన పరిశోధన విలువైనదిగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో లైబ్రరీ హెడ్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మేరుగు రవి కుమార్ విద్యా, పరిశోధనా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నారు. ఆయన సాధించిన ఈ ఘనతపై వాసవి ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు పి. రామ మోహన్ రావు, కార్యదర్శి పార్థసారథి, సీఈఓ పి. బాలాజీ, ప్రిన్సిపాల్ డా. ఎస్.వి. రమణ, కోశాధికారి ఆనంద్, జాయింట్ సెక్రటరీ పల్లవి తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరుగు రవి కుమార్ మాట్లాడుతూ, తన పరిశోధన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తన గురువు వి.వి. శ్రీనివాస్, ఐపీఎస్‌కు ఈ పరిశోధనను అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే తన జీవిత భాగస్వామి ప్రియాంక, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరుల ప్రోత్సాహం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగానని తెలిపారు. అదేవిధంగా కళాశాల యాజమాన్యం, ప్రొఫెసర్ ఉ డీన్ డా. ఆడెపు కుమారస్వామి, డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు అందించిన సహకారం తన పరిశోధన పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొంటూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యా సంకల్ప యాత్ర



**మేడిపల్లి జూన్ 12 (నగర నిజం)** గడప గడప తట్టి,
బడి ఈడు పిల్లల జాడలు వెతికి,
తల్లిదండ్రుల మనసు తలుపులు తట్టి,
ప్రభుత్వ బడి వెలుగులను పరిచయం చేస్తూ...
ఉచిత విద్య, పుస్తకాలు, బట్టలు,
పోషకాహార భోజనం, రాగిజావ విలువను చెబుతూ,
బాలల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తూ...
విద్యార్థి భవిత కోసం నడుస్తున్న
ఉపాధ్యాయుల అడుగులు–
విద్యా సంకల్ప యాత్రలు.
మాయ మాటల కంటే
మంచి బోధనే గొప్పదని,
భారీ వసూళ్ల కంటే
భరోసానిచ్చే విద్యే విలువైనదని,
ప్రైవేట్ బడుల వ్యామోహం మధ్య
ప్రభుత్వ విద్య గొప్పతనాన్ని
ప్రతి ఇంటి ముంగిట చాటుతూ...
విద్యార్థి భవిత కోసం నడుస్తున్న
ఉపాధ్యాయుల అడుగులు–
విద్యా సంకల్ప యాత్రలు.
అనుమానపు పొరలను తొలగిస్తూ
విద్యను హక్కుగా,
ప్రభుత్వ బడిని అవకాశాల నిలయంగా పరిచయం చేస్తూ,
డిజిటల్ తరగతులు, ఆంగ్ల బోధన,
ప్రతిభకు అవకాశాలు కల్పిస్తూ,
కార్పొరేట్ హంగులకు తీసిపోని
ప్రభుత్వ విద్య విజయగాథలు చెబుతూ...
విద్యార్థి భవిత కోసం నడుస్తున్న
ఉపాధ్యాయుల అడుగులు..
విద్యా సంకల్ప యాత్రలు.

**ఎం.ఏ. సత్తార్ ఖలీద్**
**గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు**
**మరియు వారి ఉపాధ్యాయ బృందం**
**బడిబాట కార్యక్రమం**
**జెడ్‌పీహెచ్ఎస్ కొండాపూర్**
**మండలం : మేడిపల్లి**
**జిల్లా : జగిత్యాల**

## నేడు గంటన్నర సేపు విద్యుత్ అంతరాయం



**మహేశ్వరం జూన్ 12 (నగరనిజం) :** నేడు (శనివారం) విద్యుత్ లైన్ ల మరమ్మత్తుల కోసం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు తుక్కుగూడ పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని మహేశ్వరం విద్యుత్ అధికారి ఏఈ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంస్థ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నగరనిజం

13 శనివారం, జూన్ 2026

# అధికారులా...? అక్రమార్కులా...?



- అధికారులే సాక్షిగా అక్రమ మార్గంలో సెల్లార్ బహుళ అంతస్తుల కమర్షియల్ భవనం
- పైసా ఫేక్ తమాషా దేఖ్ అనే ధోరణిలో అధికారులు
- అధికారుల అక్రమాలకు నిలువెత్తు నిదర్శనంగా కమర్షియల్ భవనం
- బాధ్యతారహిత అధికారులను విధుల నుండి తొలగించాలి
- గృహ నిర్మాణాలకు అధికారికంగా అనుమతులు ఇవ్వాలి

**నగర నిజం న్యూస్. 12) జూన్) జవహర్ నగర్ :** మున్సిపాలిటీ కార్యాలయం అక్రమార్కుల అడ్డగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఒక సామాన్యుడు తలదాచుకునేందుకు చిన్నపాటి గృహ నిర్మాణం చేసుకోవాలంటే మున్సిపాలిటీ అనుమతులు లేవంటూ ఆంక్షలు విధించే అధికారులు మున్సిపాలిటీ కార్యాలయానికి ఎదురుగా ప్రధాన రహదారి పక్కన నెలసరి లక్షల్లో బాడిగల ఆదాయం సమకూరే విధంగా నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తో కూడిన కోట్ల విలువచేసే బహుళ అంతస్తుల కమర్షియల్ భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది ఎవరు...? అనే విషయం నేడు పెద్ద చర్చనీయాంశంగా మారింది

## కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారా...?




మున్సిపాలిటీ నిబంధనలను పరిరక్షించడం కోసం ప్రభుత్వ ధనం లక్షల రూపాయలు నెలసరి వేతనంగా పొందుతూ గతంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా నేడు జవహర్ నగర్ ప్రాంతం గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో విలీనమైన సందర్భంగా మల్కాజ్గిరి జోన్ కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న వసంత మునిసిపాలిటీ నిబంధనల పరిరక్షణ కోసం కృషి చేయకపోవడానికి గల కారణాలు ఏమిటీ...? ప్రధాన రహదారికి పక్కన మున్సిపాలిటీ కార్యాలయానికి ఎదురుగా అధికారుల సాక్షిగా నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం అవుతున్న సెల్లార్ తో కూడిన బహుళ అంతస్తుల కమర్షియల్ భవన నిర్మాణం పనులు ఏదేచ్ఛగా కొనసాగుతూ నేడు గృహప్రవేశానికి చేరువవుతున్న ఈ అక్రమ భవన నిర్మాణం పై డిప్యూటీ కమిషనర్ వసంత ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటీ...? మామూళ్ల మహత్యమా...? అక్రమ నిర్మాణదారుల దుస్సాహసమా...? విధి నిర్వహణలో అధికార బాధ్యత రాహిత్యమా...? అనే అనుమానాలు స్థానికుల నుండి వ్యక్తమవుతున్నాయి

## ముడుపులకు ముచ్చట పడుతూ... మునిసిపల్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారా...?

గృహ నిర్మాణాలకు అనుమతులు లేని విషయాన్ని ప్రధాన హస్తంగా మలుచుకొని నివాసయోగ్యకరమైన భవన నిర్మాణాలు చేసుకోవాలంటే తెరచాటుగా అధికారులకు లక్షల్లో ముడుపులు చెల్లించుకోవడం తప్ప వేరే గత్యంతరం లేదని అధికారులు లంచం అడుగుతున్నారు అని ఎవరితోనైనా చెప్పినట్లయితే జీవితాంతం భవన నిర్మాణాలు చేసుకోలేరు అనే అధికారుల హెచ్చరికలకు లోనై తెరచాటు ఒప్పందాలు కుదుర్చుకొని దొడ్డి దారిన దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు... గుప్పుమంటున్నాయి.. లేని క్రమంలో ఎలాంటి పర్మిషన్ లు లేకుండా పుట్టగొడుగుల్లా వందలాది భవన నిర్మాణాల తతంగం ఎలా కొనసాగుతుందని గుసగుసలాడుతున్నారు ఇదే క్రమంలో

ప్రధాన రహదారి పక్కన మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా సెల్లార్ తో కూడిన ఈ బహుళ అంతస్తుల కమర్షియల్ భవన నిర్మాణదారుడు తెరచాటుగా ఎన్ని ముడుపులు చెల్లిస్తే ఈ ఈ కమర్షియల్ అక్రమ భవన నిర్మాణం పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయో...? అనే అనుమానాలు బాహాటంగా వినిపిస్తున్నాయి

## అధికారులు సక్రమంగా విధులు నిర్వహిస్తే...? ఈ అక్రమ భవన నిర్మాణం కథ ఏమిటి...?

అధికారులు ఎలాంటి అనుమానాలు అపోహలకు తావివ్వకుండా సక్రమంగా విధులు నిర్వహించిన యెడల అధికారికంగా గృహ నిర్మాణాలకు అనుమతులు పొందలేని ఈ సమయంలో ప్రధాన రహదారి పక్కన మునిసిపాలిటీ కార్యాలయానికి ముందర నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తో పాటు బహుళ అంతస్తుల కమర్షియల్ మేలిమి భవన నిర్మాణం గృహప్రవేశానికి ఎలా ముస్తాబవుతోంధీ...? ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించబడిన ఈ అక్రమ భవన నిర్మాణం వ్యవహారం చూస్తుంటే... ప్రభుత్వం ఇచ్చే జీతాల కన్నా అక్రమ సంపాదనపై ఆసక్తి చూపుతూ విధి నిర్వహణలో అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు అనడానికి ఈ అక్రమ భవన నిర్మాణం నిలువెత్తు నిదర్శనం కాదా...? మున్సిపల్ నిబంధనలు ఈ భవన నిర్మాణదారునికి వర్తించవా...? అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్న అధికారులకు చట్టం చుట్టమా...? అని స్థానికులు మండిపడుతున్నారు

## అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను విధుల నుండి తొలగించాలి

జవహర్ నగర్ ప్రాంతంలో గృహ నిర్మాణాల పర్మిషన్లు పూర్తిస్థాయిలో రద్దు చేయబడిందని భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం కుదరదని నిత్యం హెచ్చరించే అధికారులే చట్టానికి సవాల్ విసురుతూ ఏలాంటి పర్మిషన్లు లేకుండా నిర్మించిన ఈ అక్రమ భవన నిర్మాణంపై నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా పూర్తి సహాయ సహకారాలు అందించిన అధికారులను విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారులుగా గుర్తించి తక్షణమే విధుల నుండి తొలగించాలని గృహ నిర్మాణాల అనుమతులు లేకపోవడమే ప్రధాన కారణంగా అధికారులు అక్రమార్కులుగా మారుతున్నారనే విషయాన్ని గమనించి జవహర్ నగర్ ప్రాంతంలో గృహ నిర్మాణాలకు అధికారికంగా అనుమతులు పొందే సదావకాశాన్ని కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు

## అమరుల స్ఫూర్తితో ప్రజా సాంస్కృతికోద్యమానికి కొత్త సంకల్పం సమాజ మార్పుకు కళలు, సాహిత్యం శక్తివంతమైన సాధనాలు








**మొయినాబాద్, జూన్ 12 (నగర నిజం):** ప్రజల జీవితాలతో మమేకమైన కళలు, సాహిత్యం సమాజ మార్పుకు శక్తివంతమైన ఆయుధాలనే సందేశంతో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఎ.సి.ఎఫ్) నిర్వహించిన రెండు రోజుల సాంస్కృతిక శిక్షణా శిబిరం విజయవంతంగా మొయినాబాద్ లోని ఓ దగ్గర ముగిసింది. జూన్ 11, 12 తేదీల్లో జరిగిన ఈ శిబిరాన్ని విమలక్క ప్రారంభించగా, తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కళాకారులు, సాంస్కృతిక కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రజా సాంస్కృతికోద్యమ కర్తవ్యాలు, శాస్త్రీయ సోషలిజం, ఆదివాసీ కళలు–సాహిత్యం, సాంస్కృతిక ఆధిపత్య సిద్ధాంతం వంటి అంశాలపై ప్రముఖ మేధావులు, ఉద్యమకారులు లోతైన చర్చలు నిర్వహించారు. డప్పు భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన డప్పు శిక్షణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాట, నాటకం, డప్పు వంటి ప్రజా కళారూపాలను సమకాలీన ప్రజా సమస్యలతో అనుసంధానిస్తూ సాంస్కృతికోద్యమాన్ని మరింత విస్తరించాల్సిన అవసరాన్ని వక్తలు నొక్కిచెప్పారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చలు, శిక్షణా తరగతులు, సాంస్కృతిక ప్రదర్శనలు కళాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.ప్రజల పక్షాన నిలిచే సాంస్కృతిక శక్తుల ఐక్యత, చైతన్యం, కార్యాచరణకు ఈ శిబిరం వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ శ్రామిక గీతంతో శిబిరం ఉత్సాహభరితంగా ముగిసింది.

## ఎంఎంసీ జాయింట్ కమిషనర్‌ను కలిసిన స్వేరోస్ ప్రతినిధులు



**లాలాపేట, 12 జూన్ (నగర నిజం) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జాయింట్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తిప్పర్తి యాదయ్యను శుక్రవారం తార్నాకలోని ఆయన కార్యాలయంలో స్వేరోస్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వేరోస్ హైదరాబాద్ నగర కార్యదర్శి కుమార్ షాను, టీఎస్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ఆనంద్ తదితరులు యాదయ్యను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్వేరోస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ సీనియర్ నేత బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్ జన్మదిన వేడుకలు





- కిష్టయ్య ముదిరాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గుర్రం రణధీర్ రెడ్డి తో పాటు వివిధ పార్టీల నేతలు

**రాజేంద్రనగర్, జూన్ 12 (నగరనిజం ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, దివంగత మాజీ హోం మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి అనుచరుడు బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం నాడు బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నేత, చిన్న గోల్కొండ సింగిల్ విండో సొసైటీ మాజీ డైరెక్టర్ గుర్రం రణధీర్ రెడ్డి తో పాటు కాంగ్రెస్, వివిధ పార్టీలకు చెందిన నేతలు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని సిద్ధాంతి ముదిరాజ్ బస్తీకి చెందిన ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్ దివంగత మాజీ హోంమంత్రి ఇంద్రారెడ్డికి ప్రధాన అనుచరుడిగా కొనసాగారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ నేతలు కార్యకర్తలతో పాటు కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి తన జన్మదిన వేడుకలను నిరాడంబరంగా జరుపుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నేత, చిన్న గోల్కొండ సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ గుర్రం రణధీర్ రెడ్డి తో పాటు ఆ పార్టీ నేతలు మహమ్మద్ నజీరుద్దీన్, రాచమల్ల జయప్రకాష్, గుంటి ప్రవీణ్ అలియాస్ మిట్టు, మహమ్మద్ నజీర్ బాయ్, ప్రభాకర్, జిపి పాల్సన్, జి. సుబోద్ తదితర నేతలు శుక్రవారం నాడు సిద్ధాంతి లోని బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్ నివాసానికి వెళ్లి కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్ కు గుర్రం రణధీర్ రెడ్డి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. దేవుడి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గుర్రం రణధీర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గుర్రం రణధీర్ రెడ్డి తో పాటు పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలకు బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్ ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా కాంగ్రెస్ నేత గుంటి ప్రవీణ్ జన్మదిన వేడుకలు






- గుంటి ప్రవీణ్‌కు జన్మదిన
- శుభాకాంక్షలు తెలిపిన

### కాంగ్రెస్ నేత గుర్రం రణధీర్ రెడ్డి

**రాజేంద్రనగర్, జూన్ 12 (నగరనిజం ప్రతినిధి):** గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని 119 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గుంటి ప్రవీణ్ అలియాస్ మిట్టు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గుంటి ప్రవీణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, చిన్న గోల్కొండ సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ గుర్రం రణధీర్ రెడ్డి తోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుంటి ప్రవీణ్ అలియాస్ మిట్టు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శంషాబాద్ వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గుర్రం రణధీర్ రెడ్డి తో పాటు ఆ పార్టీ నేతలు మహమ్మద్ నజీర్ బాయ్, ప్రభాకర్,జి. సుబోధ్, జిపి పాల్సన్, కృష్ణ ముదిరాజ్ తదితర నేతలు గుంటి ప్రవీణ్ చేత కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గుంటి ప్రవీణ్ కు గుర్రం రణధీర్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. దేవుడి ఆశీస్సులతో గుంటి ప్రవీణ్ నిండు నూరేళ్లు చల్లగా వర్ధిల్లాలని, భవిష్యత్తులో ఆయన ఉన్నత పదవులు అలంకరించాలని గుర్రం రణధీర్ రెడ్డి ఆశీర్వదించారు. మరోవైపు టీయూడబ్ల్యూజే సభ్యుడు, జర్నలిస్ట్ మన్నె మధు కిరణ్ సైతం కాంగ్రెస్ నేత గుంటి ప్రవీణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అయితే తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అభినందనలు తెలిపిన కాంగ్రెస్ సీనియర్ నేత గుర్రం రణధీర్ రెడ్డి తో పాటు పార్టీ నేతలు కార్యకర్తలకు గుంటి ప్రవీణ్ అలియాస్ మిట్టు కృతజ్ఞతలు చెప్పారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పాలి

- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: బి. రాజేందర్




**మేడ్చల్, జూన్ 12 (నగర నిజం):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో జీడిమెట్లలో అవగాహన సదస్సు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడం, గుడ్డ మరియు జనపనార సంచుల వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సదస్సులో వ్యాపారులు, దుకాణదారులు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి కలిగే నష్టాలను అధికారులు వివరించారు. ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత ఉత్పత్తుల వినియోగం, పునర్వినియోగం, పునఃచక్రీకరణ, పునరుద్ధరణ వంటి సుస్థిర పద్ధతులను అనుసరించాలని సూచించారు. సదస్సులో వాయు, నేల, జల కాలుష్యాల ప్రభావం, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన స్టాల్‌లో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ ఉత్పత్తులు, ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల ప్రకారం నాలుగు రంగుల చెత్త బిన్ల వినియోగ విధానాన్ని ప్రదర్శించారు. ప్రదర్శనలను పరిశీలించిన పాల్గొనేవారు వ్యర్థాల వర్గీకరణ, పర్యావరణహిత ఉత్పత్తుల వినియోగం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాల అవసరంపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమం ముగింపులో హాజరైన వారికి జనపనార సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ ఇంజనీర్, 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక నోడల్ అధికారి బి. రాజేందర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు పూర్తిగా దూరంగా ఉండి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుమారు 30 మంది పాల్గొన్నారు.

# ఇటిక్యాలలో ప్లాస్టిక్‌కు చెక్

- 15 రోజుల గడువు.. ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా




**రాయికల్ జూన్ 12 (నగర నిజం)** పర్యావరణ పరిరక్షణలో భాగంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ పంచాయతీ ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు చేపట్టింది. గ్రామంలోని వ్యాపార సంస్థల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిలిపివేయాలని సర్పంచ్ నీరటి శ్రీనివాస్ సూచించారు. వ్యాపారులు ప్రత్యామ్నాయ కవర్లు వినియోగించాలని 15 రోజుల గడువు ఇచ్చారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వినియోగించినా రూ. 5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, గ్రామ సేవా సమితి అధ్యక్షుడు అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, కారోబార్ కిషోర్ పాల్గొన్నారు.




# జీహెచ్ఎంసీ అధికారులకు పట్టదా?





- ఐదు నెలలుగా రోడ్డుపైనే డ్రైనేజీ నీరు..
- కంపుకొడుతున్న ఆల్విన్ రోడ్డు
- నందన్ రతన్ ప్రైడ్, ఎమ్‌డీఆర్, ఆల్విన్ కాలనీవాసుల తీవ్ర ఆవేదన
- వాహనాలు వెళ్తుంటే చిమ్ముతున్న మురుగునీరు..
- రోగాల బారిన పడుతున్న స్థానికులు
- ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

**నగర నిజం జూన్ 12** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మహా నగరానికి ముఖద్వారంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా గుర్తింపు పొందుతున్న పటాన్‌చెరు పట్టణంలో స్థానిక జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం పతాక స్థాయికి చేరింది. ఇక్కడి ఆల్విన్ బస్ స్టాప్ నుంచి నేతాజీ నగర్ బండ్లగూడకు వెళ్లే ప్రధాన రహదారి గత ఐదు నెలలుగా మురుగు కాల్వను తలపిస్తున్నా.. సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రధాన రహదారి గుండా నిత్యం నందన్ రతన్ ప్రైడ్, ఎమ్‌డీఆర్ కాలనీ, ఆల్విన్ కాలనీ తదితర ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, గత ఐదు నెలలుగా డ్రైనేజీ నీరు నిరంతరాయంగా రోడ్డుపైనే ప్రవహిస్తూ, చెత్తాచెదారంతో పేరుకుపోవడంతో ఈ ప్రాంతమంతా కంపుకొడుతోంది. సమస్య తీవ్రతపై కాలనీవాసులు, బాటసారులు పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఇంతగా నిర్లక్ష్యం వహించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డుపై డ్రైనేజీ నీరు నిలిచి ఉండటంతో కాలినడకన వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీటి గుంతల గుండా వాహనాలు వెళ్లే సమయంలో ఆ గలీజు నీరు చిమ్మి నడకదారిన వెళ్లే వారి దుస్తులపై పడుతోందని, దీంతో నిత్యం ఇక్కడ గొడవలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసన భరించలేక ఇళ్లల్లో తలుపులు పెట్టుకుని బతకాల్సి వస్తోందని, దోమల ఉధృతి పెరిగి పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు నెలలుగా ఈ డ్రైనేజీ సమస్యతో నరకం చూస్తున్నాం. నిత్యం వేలాది మంది తిరిగే రోడ్డు ఇది. ఇంత జరుగుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు గాఢనిద్రలో మునిగిపోవడం దారుణం. ప్రజల ఆరోగ్యంపై వారికి ఏమాత్రం పట్టింపు ఉన్నా వెంటనే క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించాలి. ప్రజా ప్రతినిధులు కూడా ఈ సమస్యపై దృష్టి సారించి, డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపాలి. లేదంటే స్థానిక ప్రజలంతా కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని దశరథ్ యాదవ్ డిమాండ్ చేశారు.



పై ఫోటోలో వ్యక్తి పేరు: దశరథ్ యాదవ్





## కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలుకుతున్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రభ గౌడ్



**హైద్రాబాద్ జూన్ 12:** సికింద్రాబాద్‌లో నిర్వహించే మేధావుల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొనదానికి హైద్రాబాద్ కు చేరుకున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కుబేగంపేట్ ఎయిర్‌పోర్ట్ లో స్వాగతం పలుకుతున్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రభ గౌడ్

# శిథిల భవనాలతో ప్రజలకు ముప్పు

- పాడుబడిన ప్రభుత్వ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలి: నాచారం విజయలక్ష్మి



**మేడ్చల్, జూన్ 12 (నగర నిజం):** మేడ్చల్ పట్టణంలోని పాడుబడిన ప్రభుత్వ భవనాలు ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్నాయని, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని పాడుబడిన ప్రభుత్వ పాఠశాల భవనాలు, ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అర్జున్‌వాడ ప్రాంతంలోని రథంశాల సమీపంలో, అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా ఉన్న శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాచారం విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పలు ప్రభుత్వ భవనాలు పాడుబడి ప్రజలకు ముప్పుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం నిర్మించిన భవనాలు ప్రస్తుతం శిథిలాలుగా మారి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారడం ఆందోళనకరమన్నారు. మాజీ వార్డు సభ్యుడు గల్వ మహేష్ మాట్లాడుతూ, ఇళ్ల మధ్యలో ఉన్న ఈ పాడుబడిన భవనం రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందన్నారు. చిన్నారులు, మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతంలో శిథిల భవనం ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అదే ప్రాంతంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల వల్ల యువత చెడు అలవాట్లకు గురవుతున్నారని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గుప్తా మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను వెంటనే తొలగించడం లేదా ప్రజా అవసరాలకు అనుగుణంగా పునర్వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులు నిర్లక్ష్యానికి గురికావడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా మారిన భవనాలపై అధికారులు వెంటనే స్పందించి ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గుప్తా, జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి, ఎం. లావణ్య, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, నర్సింహులు పటేల్, మాజీ వార్డు సభ్యుడు గల్వ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'నాటో' ఫ్యూజులు పీకేసేందుకు అమెరికా యత్నాలు

**అమరావతి, నగరనిజం:** ఇరాన్ యుద్ధంలో తనకు సహకరించేందుకు ముందు కురాని ఐరోపా దేశాల విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అమెరికా సిద్ధమవుతోం ది. నాటో కూటమికి అందిస్తోన్న సహాయాన్ని కత్తిరించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు రచిస్తోంది. ఐరోపాలో నాటో కార్యకలాపాల కోసం అందుబాటులో ఉంచే విమానాలు, యుద్ధనౌకలను గణనీయంగా తగ్గించాలని అమెరికా యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అగ్రరాజ్యం తన ఆలోచనను గనక అమలు చేస్తే.. సుదూర దాడులు చేయడం, నిఘా వంటి అంశాల్లో నాటో సామర్థ్యాలు పరిమితం కానున్నాయని తెలుస్తోంది. అమెరికా తన ప్లాన్‌లో భాగంగా ఎఫ్–16, ఎఫ్–15జు ఫైటర్ జెట్ల సంఖ్యను 150 నుంచి 100కు తగ్గొచ్చు. అలాగే, సముద్ర నిఘా విమానాల సంఖ్యను 26 నుంచి 15కు కుదించొచ్చు. ఐరోపాలో అందుబాటులో ఉన్న ఎనిమిది రీఫ్యూయెలింగ్ ట్యాంకర్ విమానాలను ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి. జలంతర్గామి, విమాన వాహక నౌకతో సహా ఐరోపాలో నాటో కార్యకలాపాల్లో భాగమయ్యే పలు నౌకలు, విమానాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# ఘనంగా తెలంగాణ ఉద్యమకారుడు మంచర్ల హరికృష్ణ జన్మదిన వేడుకలు





- హరికృష్ణకు అభినందనలు తెలిపిన గులాబీ పార్టీ నేతలు

**రాజేంద్రనగర్, జూన్ 12 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ కు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మంచర్ల హరికృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం నాడు మంచర్ల హరికృష్ణ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆ పార్టీ శంషాబాద్ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్ రావు, శంషాబాద్ 118 డివిజన్ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి, కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, పార్టీ కన్వీనర్ దేవరంపల్లి బుచ్చిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాచమల్ల జయసింహ, పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ మలిదశ ఉద్యమకారులు పాలమాకుల్ అశోక్, రాచమల్ల రమేష్, వెంకట్ రెడ్డి, వీరమల్లు హనుమంతు ముదిరాజ్ తదితర నేతలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. దేవుడి ఆశీస్సులతో హరికృష్ణ నిండు నూరేళ్లు చల్లగా వర్ధిల్లాలని, భవిష్యత్తులో ఆయనకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉండాలని గులాబీ పార్టీ నేతలు ఆకాంక్షించారు.

# పాఠశాల విద్యా సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఆందోళన

- డీఈవో కార్యాలయం ముట్టడి..




### ప్రభుత్వంపై విద్యార్థి సంఘం విమర్శలు

మేడ్చల్, జూన్ 12 (నగర నిజం): పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఈవో కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను వినిపించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పాఠశాల విద్యా వ్యవస్థ అనేక సమస్యలతో సతమతమవుతోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత కొనసాగుతుండగా, అనేక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు పూర్తిస్థాయిలో అందలేదని విమర్శించారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, తరగతి గదులు వంటి కనీస సౌకర్యాలు కూడా పలు పాఠశాలల్లో లేవని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పెరుగుతోందని, విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పాఠశాల విద్యా రంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్, ఎస్‌డబ్ల్యూసీ సభ్యుడు అఖిల్, జిల్లా కన్వీనర్లు మృతుంజయ్, బాలు, భరత్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రధాన డిమాండ్లు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం
నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు
డీఈవో, ఎంఈవో ఖాళీల భర్తీ
ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నియామకాలు
గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణం
విద్యార్థుల సమస్యల పరిష్కారం, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలనే డిమాండ్‌తో చేపట్టిన ఈ ఆందోళన మేడ్చల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# ప్రభుత్వ భూముల కబ్జాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

- ఫిరోజ్ ఆత్మహత్యాయత్నం ఘటనపై

### ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్



**కుత్బుల్లాపూర్, 12 జూన్ (నగర నిజం ప్రతినిధి):** ప్రభుత్వానికి చెందిన టీఎస్ఐఐసీ భూముల కబ్జాల ప్రభుత్వ భూముల కబ్జాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలిఫిరోజ్ ఆత్మహత్యాయత్నం ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ కుత్బుల్లాపూర్, 12 జూన్ (నగర నిజం ప్రతినిధి): ప్రభుత్వానికి చెందిన టీఎస్ఐఐసీ భూముల కబ్జాల వ్యవహారంలో సంబంధిత వ్యక్తులపై పూర్తి స్థాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. కేవలం డీజిల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం ద్వారా ప్రభుత్వ భూములపై జరిగిన కోట్ల రూపాయల విలువైన కబ్జాలపై విచారణ ఆగిపోవడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ అంశం ఈరోజు మొదలైనది కాదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచే సంబంధిత భూములపై ఫిర్యాదులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి, అధికారులు లేదా ప్రజలు ప్రశ్నిస్తే ఆత్మహత్య బెదిరింపులకు పాల్పడటం ద్వారా చట్టాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఫిరోజ్ వద్ద ఉన్న భూ పత్రాలు, ఇతర ఆధారాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని, నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిన్న ఉదయం చోటుచేసుకున్న ఆత్మహత్యాయత్నం ఘటనపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా, సర్వే నంబర్ 79లో ప్రభుత్వ భూములపై జరిగిన ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు పోలీసు రక్షణ కల్పించాలని కుత్బుల్లాపూర్ ఎంఆర్‌వోను కోరారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ఫిరోజ్ నుంచి ప్రాణహాని ఉందనే అనుమానం వ్యక్తం చేస్తూ, ఆయన వ్యవహారశైలి పలు సందేహాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో రాజకీయ కుట్ర కోణం కూడా ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, అక్రమాలపై ప్రశ్నించే హక్కు సామాన్య ప్రజలకు ఉందని పేర్కొంటూ, "సామాన్యులు ప్రశ్న అడగొద్దా?" అని ప్రశ్నించారు. ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి నిజాలను వెలికితీయాలని కోరారు. వ్యవహారంలో సంబంధిత వ్యక్తులపై పూర్తి స్థాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. కేవలం డీజిల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం ద్వారా ప్రభుత్వ భూములపై జరిగిన కోట్ల రూపాయల విలువైన కబ్జాలపై విచారణ ఆగిపోవడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ అంశం ఈరోజు మొదలైనది కాదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచే సంబంధిత భూములపై ఫిర్యాదులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి, అధికారులు లేదా ప్రజలు ప్రశ్నిస్తే ఆత్మహత్య బెదిరింపులకు పాల్పడటం ద్వారా చట్టాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఫిరోజ్ వద్ద ఉన్న భూ పత్రాలు, ఇతర ఆధారాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని, నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిన్న ఉదయం చోటుచేసుకున్న ఆత్మహత్యాయత్నం ఘటనపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా, సర్వే నంబర్ 79లో ప్రభుత్వ భూములపై జరిగిన ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు పోలీసు రక్షణ కల్పించాలని కుత్బుల్లాపూర్ ఎంఆర్‌వోను కోరారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ఫిరోజ్ నుంచి ప్రాణహాని ఉందనే అనుమానం వ్యక్తం చేస్తూ, ఆయన వ్యవహారశైలి పలు సందేహాలకు తావిస?

# దేవరకద్ర ఎస్ఐగా భాస్కర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

- అభినందనలు తెల్పుతూ శాలువాతో సన్మానించిన

### యువజన కాంగ్రెస్ నాయకుడు చందుగౌడ్




**జూన్ 12,(నగర నిజం ప్రతినిధి)** :మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర ఎస్ఐగా భాస్కర్ రెడ్డి శుక్రవారం రోజు బాధ్యతలు స్వీకరించారు. భూత్పూర్, కోయిలకొండ, మహబూబ్ నగర్ రూరల్,ట్రాఫిక్ ఎస్ఐగా భాస్కర్ రెడ్డి విధులు నిర్వహించారు. దేవరకద్ర మండల పోలీస్ స్టేషన్ కు నూతన ఎస్ఐ గా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ భాస్కర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన యువజన కాంగ్రెస్ నాయకుడు కోయిల్ సాగర్ చందు గౌడ్.

# నిరుపేద విద్యార్థికి ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేసిన సరోజ్ రెడ్డి




**జూన్ 12,(నగర నిజం ప్రతినిధి)**మహబూబ్ నగర్ చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామానికి చెందిన గొల్ల బుచ్చన్న కూతురి డీఎంఎల్టీ కోర్స్ చదువు కోసం పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన హై కోర్ట్ అడ్వకేట్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి సరోజ్ రెడ్డి. అదేవిధంగా గ్రామానికి చెందిన వడ్డే కృష్ణన్న ఇటీవలి కాలంలో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆపదలో అండగా ఉన్న సరోజ్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సరోజ్ మిత్ర మండలి సభ్యులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణ కేసులో వ్యక్తిపై కేసు నమోదు



**కుత్బుల్లాపూర్, 12 జూన్ (నగర నిజం ప్రతినిధి):** ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించి అనధికార నిర్మాణం చేపట్టడంతో పాటు విధులు నిర్వర్తిస్తున్న రెవెన్యూ అధికారులను అడ్డుకుని బెదిరించిన ఘటనలో ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కుత్బుల్లాపూర్ మండల మండల రెవెన్యూ అధికారి ఫిర్యాదు మేరకు గాజులరామారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 79లో ప్రభుత్వ భూమిని నెహ్రూనగర్‌కు చెందిన ఫిరోజ్ ఖాన్ అక్రమంగా ఆక్రమించి నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 11న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ప్రయత్నించగా, ఫిరోజ్ ఖాన్ అధికారులను అడ్డుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా నిర్మాణాన్ని కూల్చివేస్తే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరిస్తూ అధికారులను బెదిరించినట్లు ఆరోపించారు. దీంతో ప్రభుత్వ అధికారుల విధుల నిర్వహణకు ఆటంకం కలిగించినట్లు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
ఫిర్యాదు ఆధారంగా పోలీసులు క్రైం నంబర్ 558/2026గా కేసు నమోదు చేసి సంబంధిత నిబంధనల కింద దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్న పోలీసులు, సంఘటనపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

## ఘనంగా గులాబీ పార్టీ నేత మంచర్ల మోహన్ రావు జన్మదిన వేడుకలు





- మోహన్ రావు కు శుభాకాంక్షలు తెలిపిన సబితా

### ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి తో పాటు పార్టీ నేతలు

**రాజేంద్రనగర్, జూన్ 12 (నగరనిజం ప్రతినిధి):**రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచర్ల మోహన్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శంషాబాద్ మండలం లోని పోశెట్టి గూడ గ్రామానికి చెందిన మంచర్ల మోహన్ రావు ప్రస్తుతం పార్టీ శంషాబాద్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు మంచర్ల మోహన్ రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆ పార్టీ నేతలు కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, గులాబీ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్,డీసీసీబీ మాజీ డైరెక్టర్ బూరుకుంట సతీష్, గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ లోని శంషాబాద్ 118 బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి, కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, పార్టీ మహిళా అధ్యక్షురాలు మడుపతి పరమేశ్వరి నరేందర్, శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్ల పార్టీ కన్వీనర్ దేవరంపల్లి బుచ్చిరెడ్డి, రెండు డివిజన్ల పార్టీ జాయింట్ సెక్రటరీ రాచమల్ల జయసింహ, పార్టీ సీనియర్ నేతలు బైరమోని మల్లేష్ ముదిరాజ్, పాలమాకుల అశోక్, వెంకట్ రెడ్డి, వీరమల్లు హనుమంతు ముదిరాజ్, రాచమల్ల రమేష్ తదితర నేతలు మంచర్ల మోహన్ రావు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి తో పాటు పార్టీ నేతలు కార్యకర్తలు అందరికీ మంచర్ల మోహన్ రావు ధన్యవాదాలు తెలిపారు.

# గంగ వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వెంటనే ప్రారంభించాలి

- తహసీల్దార్‌కు బీజేపీ నేతల వినతి



**మేడ్చల్, జూన్ 12 (నగర నిజం):** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గంగ వెంచర్‌లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్లాట్ యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేంకు గురువారం మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. గంగ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన అనేక మంది కుటుంబాలు రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో ఆర్థిక, న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకురాలు జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ, ప్లాట్ల కొనుగోలుదారుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిగణించాలని కోరారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రజల్లో అయోమయం నెలకొన్నదని, వెంటనే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలు కష్టార్జిత ధనంతో స్థలాలు కొనుగోలు చేశారని, వారి హక్కులను పరిరక్షించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆమె అన్నారు. గంగ వెంచర్ వ్యవహారాన్ని త్వరితగతిన పరిష్కరించి ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పాతూరి ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకుడు బొజ్జ రాఘవ రెడ్డి, మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమ దాసు, మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, బండి విష్ణు, ధాత్రిక లక్ష్మణ్ వంజరి, తోట అనిత, బొజ్జ వంశీ రెడ్డి, జకట బాబు రాజు, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, పురుషోత్తం, మల్లికార్జున్, ఎన్.ఎస్. గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించాలని, గంగ వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

## వనపర్తి లోని ఈనెల 15 న దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం మహాసభ విజయవంతం చేయండి

- తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



వనపర్తి జిల్లా: నగర నిజం జూన్ 12 వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీ నందు యాదవ సంఘం భవనంలో 15 -06 -2026 జిల్లా స్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళన మహాసభకు తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి , రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ - వనపర్తి డి సి సి శివసేన రెడ్డి , రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జూపల్లి అరుణ్ , ముఖ్య అతిథులుగా వస్తున్నారు కావున జిల్లాలో ఉండే వికలాంగుల అందరూ హాజరై సభను విజయవంతం చేయవలసిందిగా ఒక ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు ఎస్. భాను కుమార్, ఎన్ పి ఆర్ డి వనపర్తి పట్టణ అధ్యక్షులు మధిర శ్రీశైలం, ఎన్ పి ఆర్ డి ఇండియా జిల్లా అధ్యక్షులు చింతకుంట మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సమాఖ్య అధ్యక్షులు మీసాల మోహన్, విహెచ్పి ఎస్ కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు

## సర్వే నెంబర్. 52లో భూ ఆక్రమణదారుల నుంచి మున్సిపల్ ఆస్తిని కాపాడండి

- కమిషనర్ కి వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు
- నగర నిజం తాండూర్ ప్రతినిధి జూన్ 12:::



వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్. 52లో మున్సిపల్ ఆస్తిని భూ అక్రమణ దారుల నుంచి కాపాడాలని 6వ వార్డ్ కౌన్సిలర్ అనిల్ కుమార్, బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నెంబర్. 52లో 13.12ఎకరాల భూమి తాండూర్ మున్సిపల్ కి చెందిందని అన్నారు. 1964లో రిజిస్టర్ సేల్ డీడ్ నెంబర్. 202/1964ద్వారా కొనుగోలు చేసిందని.. అందులో కొంతభాగం మున్సిపల్ భవనాలు, విద్యుత్ శాఖ, రాఘవేంద్ర కాలనీ అభివృద్ధి కోసం వినియోగించిన, ప్రస్తుతం మున్సిపల్ రికార్డులు ప్రకారం గణనీయమైన భూమి ఉంది. అయితే కొంతమంది వ్యక్తులు మున్సిపల్ భూమిని ఆక్రమించి, అనుమతులు లేకుండానే కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వెంటనే సర్వే నెంబర్. 52లో సర్వే చేపట్టి, భూ ఆక్రమణ దారులపై చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అదేవిదంగా, ఈ భూమికి హద్దులు, బోర్డులు ఏర్పాటు చేసి ప్రజా ఆస్తిని భూ ఆక్రమణదారుల నుంచి రక్షించాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ గవర్నర్ని మర్యాదపూర్వకంగా కలిసినబీజేపీ జాతీయ నాయకులు అశ్విని భాయ్, క్లూ టుడే న్యూస్ ఛానల్ ఎడిటర్ ఠాకూర్ సూరజ్ సింగ్..



**నగర నిజం తాండూర్ ప్రతినిధి జూన్ 12::::**తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా.. బీజేపీ జాతీయ నాయకులు అశ్విని భాయ్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా.. "క్లూ టుడే న్యూస్ ఛానల్ ఎడిటర్ ఠాకూర్ సూరజ్ సింగ్, చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు కోమిడి వెంకటరెడ్డి, సిఎన్ రెడ్డి, ఎస్ ఆర్ ఈ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కే ఎం మోహన్ రావు, సన్ మార్ట్ ఫర్నిచర్ యాజ మాని భవాని విక్రమ్ సింగ్ ఠాకూర్ మర్యాద పూర్వ కంగా గవర్నర్ ని కలిసిన వారిలో ఉన్నారు.



## ఆదిలక్ష్మి ఫుడ్ కోర్ట్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా యలమంచి ఉదయ్ కిరణ్

**కుత్బుల్లాపూర్, 12 జూన్ (నగర నిజం ప్రతినిధి):** మియాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిలక్ష్మి ఫుడ్ కోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ తథా మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు మియాపూర్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ తాండ్ర రాంచందర్ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఆదిలక్ష్మి ఫుడ్ కోర్ట్ యాజమాన్యం ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో యలమంచి ఉదయ్ కిరణ్ ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపార సంస్థను ప్రారంభించడం అభినందనీయమని పేర్కొంటూ, వ్యాపార రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులను శాలువాతో సత్కరించి గౌరవించిన ఆయన, యువ పారిశ్రామికవేత్తలు ఉపాధి అవకాశాలను సృష్టిస్తూ సమాజాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించడం సంతోషకరమని అన్నారు. నాణ్యమైన ఆహార పదార్థాలు, వినియోగదారుల విశ్వాసం, సేవాభావం వంటి అంశాలే వ్యాపార విజయానికి పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తాండ్ర రాంచందర్




గౌడ్ మాట్లాడుతూ, స్థానికంగా కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఆదిలక్ష్మి ఫుడ్ కోర్ట్ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, వెంకటేష్,



రత్నాచారి తదితర ప్రముఖులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహార సేవలను అందిస్తూ ఆదిలక్ష్మి ఫుడ్ కోర్ట్ ?

## ప్రజల ఆనందాల్లో భాగస్వాములైన ఎమ్మెల్సీ శంభిపూర్ రాజన్న, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జాలిగం రాకేష్





**కుత్బుల్లాపూర్, 12 జూన్ (నగర నిజం ప్రతినిధి):** మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజన్న గారితో కలిసి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జాలిగం రాకేష్ గారు పలు శుభకార్యక్రమాల్లో పాల్గొని ప్రజల ఆనందాల్లో భాగస్వాములయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వివాహ మహోత్సవాలు, గృహ ప్రవేశ కార్యక్రమాలు, జన్మదిన వేడుకలు, నిశ్చితార్థ వేడుకలు, వ్యాపార సంస్థల ప్రారంభోత్సవాలు తదితర శుభకార్యక్రమాలకు హాజరై నిర్వాహకులు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలకు విచ్చేసిన ఎమ్మెల్సీ శంభిపూర్ రాజన్న గారికి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జాలిగం రాకేష్ గారికి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమాలకు హాజరైన ప్రజలతో వారు ఆత్మీయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభిపూర్ రాజన్న మాట్లాడుతూ, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం, వారి సంతోషాలు, కష్టసుఖాల్లో భాగస్వాములు కావడం ప్రజా ప్రతినిధుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో కుటుంబ విలువలు, మానవ సంబంధాలు, పరస్పర ఆప్యాయతలు మరింత బలోపేతం కావాలంటే ఇటువంటి శుభకార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదాలు, అభిమానమే తమకు మరింత సేవా కార్యక్రమాలు చేయడానికి ప్రేరణనిస్తాయని తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జాలిగం రాకేష్ మాట్లాడుతూ, పార్టీ నాయకత్వం చూపిన మార్గంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నామని అన్నారు.





### వనపర్తి పట్టణం లోని బండారు నగర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో పలు కాలనీలో 'బడిబాట'..

## పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయుల పిలుపు



**వనపర్తి జిల్లా: నగర నిజం జూన్ 12** వనపర్తి పట్టణంలోని శుక్రవారం నాడు ప్రభుత్వం చేపట్టిన బడిబాటి కార్యక్రమం భాగంగా స్కూల్ ఎల్ ఎఫ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఆధ్వర్యంలో మీ విద్య కాలనీలో భగత్ సింగ్ నగర్ , తాళ్ళచెరువు , పీర్లగుట్ట సమీపంలోని ప్రభుత్వ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం నాడు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. నిమగ్నమైన తల్లిదండ్రుల వద్దకు నేరుగా వెళ్లి బడిబాట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాల వయస్సు ఉన్న ప్రతి బిడ్డను బడికి పంపాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## అమెరికా క్షిపణి దాడిలో మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేష్ మృతి...

- చంద్రబాబు తీవ్ర విచారం

**అమరావతి, నగర నిజం:** ఒమన్ తీరంలో ఆయిల్ ట్యాంకర్‌పై జరిగిన అమెరికా క్షిపణి దాడిలో విశాఖపట్నానికి చెందిన చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేష్ మృతి చెందారు. ఈ విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సురేష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన అధికారులను ఆదేశించారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ మేరకు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాలతో ఏపీ భవన్ అధికారులు ఈ వ్యవహారాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ఒమన్ ప్రభుత్వం, భారత ఎంబసీతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు.

నగరనిజం

# ఈ నెల 14న జమ్మాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రాక

- ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు
- కొమ్ము చెన్నకేశవులు మాదిగ



**వనపర్తి జిల్లా నగర నిజం జూన్ 12 వనపర్తి జిల్లా :**పానగల్ మండలం జమ్మాపూర్ గ్రామంలో నిర్వహించనున్న భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా కమిటీ నాయకులు శుక్రవారం నాడు వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ని కలిసిన సంగతి తెలిసిన విషయం విగ్రహావిష్కరణకు జిల్లా కమిటీ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. జమ్మాపూర్ గ్రామంలో నిర్వహించనున్న అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరగా, కార్యక్రమానికి హాజరవుతానని మంద కృష్ణ మాదిగ ప్రకటనలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను గ్రామీణ స్థాయిలో ప్రజలకు చేరవేయడం, సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవ సాధన కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడం నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంబేద్కర్ గారి ఆలోచనలు సామాజిక మార్పుకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్గదర్శకాలని, యువత ఆయన సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అనుబంధ సంఘాల సమన్వయ కర్త గంధం గట్టయ్య, మొలకలపల్లి పరుశురాముడు మాదిగ, ఎంఎస్ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు, జమ్మాపూర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎర్రం రాములు, ఎర్రం చంద్రయ్య, ఎర్రం గోవిందు, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా. ఎర్రం నాగేంద్రం, మాజీ ఎంపీటీసీ సభ్యులు కురుమయ్య, వర్మ మాదిగ, ఎమ్మార్పీఎస్ వనపర్తి మండల అధ్యక్షులు మచ్చ తిరుపతి మాదిగ, గొర్ల ఆంజనేయులు, శ్రీను, ఇ రాములు మరియు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. జమ్మాపూర్ గ్రామంలో నిర్వహించనున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం....అంధకారంలో శంషాబాద్





- కొద్దిపాటి వర్షానికే గంటల తరబడి కరెంటు కోతలు
- గంటల తరబడి విద్యుత్ సరఫరా లేక శంషాబాద్ ను కమ్మేసిన కారు చీకటి
- కరెంటు ఎప్పుడు వస్తుంది అంటే వరదలు ఎలా పారుతున్నాయో చూడండి అంటూ ట్రాన్స్కో సిబ్బంది నిర్లక్ష్య సమాధానం
- ట్రాన్స్కో సిబ్బంది నిర్లక్ష్యం పై శంషాబాద్ వాసుల ఆగ్రహం

**రాజేంద్రనగర్, జూన్ 12 (నగరనిజం ప్రతినిధి)** భారీ వర్షం లేదు....వరదలు అంతకంటే పారలేదు.... కానీ గంటల తరబడి విద్యుత్ సరఫరా మాత్రం నిలిచిపోయింది....

ఫలితం ఒకవైపు అంధకారం....మరోవైపు ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. శుక్రవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి శంషాబాద్ ప్రాంతాన్ని కారు చీకటి కమ్మేసింది. కొద్దిపాటి వర్షానికే గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఒకవైపు అంధకారం....మరోవైపు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. పట్టించుకోవాల్సిన ట్రాన్స్కో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో గత కొన్ని రోజులుగా ఋతుపవనాలు దోబూచులాడుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఉన్నట్లుండి ఉరుములు మెరుపులతో శంషాబాద్ తో పాటు పరిసర గ్రామాల్లో చెదురు ముదురు వర్షం కురిసింది. అరగంట పాటు కురిసిన వర్షం నేపథ్యంలో ముందస్తు చర్యగా ట్రాన్స్కో అధికారులు విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. అయితే అరగంట పాటు కురిసిన వర్షం ఆ తర్వాత ఆగిపోయినప్పటికీ ట్రాన్స్కో అధికారులు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించలేదు. దీంతో రాత్రి 8:30 నుండి అర్ధరాత్రి వరకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షం నిలిచిపోయినప్పటికీ ట్రాన్స్కో సిబ్బంది స్పందించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిపాటి వర్షానికే గంటలు తరబడి కరెంటు కోతలు విధించడంతో ఒకవైపు అంధకారం.... మరోవైపు ఉక్కపోతతో శంషాబాద్ వాసులు నరకాన్ని చవి చూశారు. గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోతను భరించలేకపోయిన జనం విద్యుత్ సరఫరాను ఎప్పుడు పునరుద్ధరిస్తారు అంటూ శంషాబాద్ ట్రాన్స్కో కార్యాలయానికి ఫోన్ చేస్తే ఉదయం లేచి చూడండి వరదలు ఎలా పారుతున్నాయో మీకే తెలుస్తుంది అంటూ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం విస్మయాన్ని కలిగించింది. శంషాబాద్ విద్యుత్ కార్యాలయం సిబ్బంది నిర్లక్ష్య వైఖరి పై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

# ఐఐటీ మద్రాస్ అద్భుత ఆవిష్కరణ..

- మానవ బ్రెయిన్‌స్టెమ్‌కు 3డీ అట్లాస్
- ఐఐటీ మద్రాస్ నుంచి ప్రపంచంలోనే అత్యంత స్పష్టమైన బ్రెయిన్‌స్టెమ్ 3డీ అట్లాస్
- 'యాంకర్' పేరుతో ఈ డిజిటల్ మ్యాప్ ఆవిష్కరణ
- మెదడు సంబంధిత వ్యాధులపై పరిశోధనలకు ఎంతగానో దోహదం
- బ్రిక్స్ న్యూరోసైన్స్ సదస్సులో అధికారికంగా విడుదల
- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో గొప్ప ఆవిష్కరణ అని ప్రశంసలు




**అమరావతి,నగర నిజం:** చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీ మద్రాస్) వైద్య శాస్త్ర రంగంలో ఒక కీలక మైలురాయిని సాధించింది. కణ స్థాయిలో మానవ బ్రెయిన్‌స్టెమ్ కు సంబంధించి ప్రపంచంలోనే అత్యంత స్పష్టమైన 3డీ అట్లాస్‌ను ఆవిష్కరించింది. 'యాంకర్'గా నామకరణం చేసిన ఈ అట్లాస్, మెదడు సంబంధిత పరిశోధనలు, చికిత్సల కోసం అపూర్వమైన వనరుగా నిలవనుంది. మానవ శరీరంలో శ్వాస, హృదయ స్పందన, నిద్ర వంటి కీలక విధులను నియంత్రించే మెదడులోని ప్రధాన భాగాన్ని 'బ్రెయిన్‌స్టెమ్' అంటారు. ఈ ప్రాంతం లో తలెత్తే స్వల్ప సమస్యలైనా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయి. ఐఐటీ మద్రాస్‌లోని సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్ అభివృద్ధి చేసిన ఈ 'యాంకర్' అట్లాస్... పిండం దశ నుంచి బాల్యం, వయోజన దశల వరకు మెదడులో చోటుచేసుకునే మార్పులను వివరిస్తుంది. ఇందులో 200కు పైగా బ్రెయిన్‌స్టెమ్ న్యూక్లియై, ఫైబర్ ట్రాక్టులను అత్యంత స్పష్టంగా 3డీ రూపంలో పొందుపరిచారు. జూన్ 5 నుంచి 7 వరకు ఐఐటీ మద్రాస్ ప్రాంగణంలో జరిగిన 3వ బ్రిక్స్ న్యూరోసైన్స్ సింపోజియంలో ఈ అట్లాస్‌ను అధికారికంగా విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, వైద్య నిపుణుల సౌకర్యార్థం దీనిని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో డిజిటల్ రూపంలో ఉచితంగా అందుబాటులో ఉంచారు. ఈ ఆవిష్కరణ న్యూరోబయాలజీ రంగంలో ఒక చారిత్రాత్మక విజయమని భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ ప్రశంసించారు. ఎంఆర్ఐ, హిస్టాలజీ వంటి బహుళ ఫ్రేమ్‌వర్క్‌లను ఏకీకృతం చేస్తూ ఈ అట్లాస్‌ను రూపొందించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ సంస్థల సహకారం, ప్రైవేట్ భాగస్వామ్యం, దాతల తోడ్పాటు కలిసి పనిచేస్తే ఇటువంటి అద్భుతమైన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని ఆయన కొనియాడారు. ఈ విజయంతో అంతర్జాతీయ న్యూరోసైన్స్ పరిశోధనలలో

# సీఎం ప్రయాణిస్తున్న విమానం బెంగళూరుకు దారి మళ్లింపు

- రాత్రి 9 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్ కావాల్సిన ఇండిగో విమానం
- శంషాబాద్ లో భారీ వర్షంతో వాతావరణం అనుకూలించక విమానం దారి మళ్లింపు







**రాజేంద్రనగర్, జూన్ 12 (నగరనిజం ప్రతినిధి)**ఢిల్లీ నుండి హైదరాబాద్ కు ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న ఇండిగో విమానాన్ని బెంగళూరు విమానాశ్రయానికి దారి మళ్లించారు. శుక్రవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో ఉన్నట్టుండి భారీ వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకొని ఢిల్లీ ఇందిరాగాంధీ విమానాశ్రయం నుండి 6ఈ 717 విమానంలో హైదరాబాద్ కు బయలుదేరారు. అయితే శుక్రవారం రాత్రి ఉన్నట్లుండి భారీ వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీంతో విమానం ల్యాండింగ్ కు వాతావరణం అనుకూలించకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న ఇండిగో విమానం 6ఈ 717 విమానం ల్యాండింగ్ కు ఏటీసీ అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో రాత్రి 9 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్ కావాల్సిన ఇండిగో విమానాన్ని బెంగళూరు విమానాశ్రయానికి దారి మళ్లించారు. ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న విమానం బెంగళూరు విమానాశ్రయానికి దారి మళ్లించడంతో శంషాబాద్ విమానాశ్రయంలో అలజడి రేగింది.

# మోదీ నాయకత్వంలో మన దేశం అద్భుతమైన గుర్తింపును పొందింది

- 2047 నాటికి వికసిత్ భారత్ గా మార్చడమే లక్ష్యమన్న అరుణ
- రైతులకు రూ. 24 వేల వరకు ఎరువుల సబ్సిడీని కేంద్రం అందిస్తోందని వెల్లడి



**అమరావతి,నగర నిజం:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుస్థిర నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన గుర్తింపును సొంతం చేసుకుందని బీజేపీ ఎంపీ డీకే అరుణ కొనియాడారు. 2047 నాటికి దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బలమైన వ్యూహంతో ముందుకు సాగుతోందని ఆమె స్పష్టం చేశారు. మహిళా సాధికారత, అన్నదాతల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అరుణ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2030 నాటికి దేశవ్యాప్తంగా 3 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి, క్రోర్‌పతి దీదీలు'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. అలాగే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ, రైతులకు ఎకరాకు రూ. 24 వేల వరకు ఎరువుల సబ్సిడీని అందిస్తోందని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ప్రజల జీవితాల్లో ఎంతో భరోసానిచ్చాయని వివరించారు. మోదీ తీసుకున్న సాహసోపేతమైన, విప్లవాత్మక నిర్ణయాల వల్లే భారత్ నేడు ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అరుణ మీడియాతో వ్యాఖ్యానించారు.

## సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు: కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్

- రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ పిటిషన్ కొట్టివేత

**అమరావతి, నగర నిజం:** రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టులో చుక్కెదురైనప్పటికీ, ఇది తనకు ఎదురుదెబ్బ కాదని కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతోందో ఈ ఘటనతో బహిర్గతమైందని ఆమె వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలపై గౌరవం ఉందని, అందుకే కోర్టు తీర్పుపై నేరుగా స్పందించనని తెలిపారు. ఈ పరిణామం తనను షాక్‌కు గురిచేయలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై తమకు నమ్మకం లేదని, అయితే తమ న్యాయపరమైన వాదనలో ఎలాంటి బలహీనత లేదని ఆమె పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వేసిన తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. దీనిపై ఎన్నికల సంఘంలో పిటిషన్ ద్వారానే పరిష్కారం వెతుక్కోవాలని సూచించింది.